
# లేమ

పరిమెళ్ళ నారాయణ



నిండా ఆరేళ్ళైనా నిండని బుజ్జిగాడి పేరు మారిపోయింది. బుజ్జిగాడి పేరు వెనుక బోల్డు కథుంది. వాడి అసలు పేరు 'భుజంగ జనార్దనం'. వాళ్ళ అమ్మానాన్నల తోడవుట్టిన వాళ్ళెవరికీ మగపిల్లలు లేరు. దాదావు అందరికీ ఒకరో ఇద్దరో ఆడపిల్లలే వున్నారు. మరి కొందరికైతే ఇంకా పిల్లలే పుట్టలేదు. అందువల్ల వాడంటే అందరికీ ముద్దు. వాడి పేరులో 'భుజంగం' అన్నది వాడి తండ్రి తండ్రి పేరైతే, 'జనార్దనం' అన్నది తల్లి తండ్రి పేరు. అవురూపంగా పుట్టేడేమో ఇద్దరి తాతల పేర్లూ కలిపి వాడి పేరుగా ధృవీకరించారంతా. ఇంట్లో వాడి పేరును ప్రతిసారి పూర్తిగా పిలవవలసి రావడం అందరికీ ఇబ్బందికరంగా పరిణమించింది. ఒకవేళ 'భుజంగం' అని తండ్రి తరవు వాళ్ళు పిలిస్తే తల్లి తరవు వాళ్ళకి, 'జనార్దనం' అని తల్లి తరవు వాళ్ళు పిలుస్తుంటే తండ్రి తరవు వాళ్ళకీ కోపతాపాలొస్తున్నాయి. అందరూ కలిపి ఆలోచించి రెండు పేర్లలో మొదటి అక్షరాలని తీసుకుని 'భుజ' అని పిలవాలనుకొన్నారు. కాని ఆ పేరుకి ఓ సరైన తీరున్నట్టు ఎవరికీ తోచలేదు. అందువల్ల ఆ 'భుజ' కాస్తా 'బుజ్జి' గా మారిపోయింది. అందరికీ వాడి మీదున్న ముద్దు వల్ల ఆ పేరుకి మరింత బలం చేకూరింది. ఇదంతా ఓ పెద్ద ప్రహసనమయ్యింది. ఇంక ఆ పేరు అలాగే కొనసాగుతుందని అనుకొంటుంటే వాడికి మరో కొత్త పేరొచ్చింది. ఆ పేరు 'ముదురు'.

బుజ్జిగాడి మాటలే కాకుండా వాడికొచ్చే ఇత్యాది సందేహాలన్నీ కూడా 'ముదర'గా వుంటాయట. అందువల్లే వాడికి ఆ పేరు వచ్చిందిట. తన పేరు అలా మారడానికి బుజ్జిగాడికి తెలిసిన కారణాలవీ. కాని, ముదర కబుర్లంటే ఏంటో మాత్రం వాడికి తెలిసిరాలేదు. కొందరు వాడి కబుర్లని ముదర కబుర్లంటూంటే, మరికొందరు పెద్ద కబుర్లనీ, ఇంకొందరు పణుకు కబుర్లనీ అంటుంటారు. అసలివన్నీ ఒకటేనా? కాదా? అన్నది కూడా వాడికి సందేహమై కూర్చుంది. దానిని ఎలా తీర్చుకోవాలా? అని ఆలోచించి, ఓ రోజు తల్లి దగ్గరకెళ్ళి "అమ్మా ముదర కబుర్లంటే ఏంటే?' అని అడిగాడు.

"అమ్మ వెధవా, ఇలా అడగడమే ఓ పెద్ద ముదరకబురు. ఇలాంటి మాటలు మాటాడొద్దని చెప్పానా?" అంటూ ఆమె కళ్ళెర్రజేసింది.

బుజ్జిగాడికి ఏడవాలో, నవ్వాలో అర్ధమవ్వలేదు. ఈసారి వాళ్ళ మామ్మ దగ్గరకెళ్ళి అడిగాడు. ఆవిడ ఏమనుకుందో ఏమోగానీ, "పెద్దవాళ్ళ మాటల్ని పిల్లలు మాట్లాడితే ముదరకబుర్లంటారు" అని ఓ చిన్న నిర్వచనమిచ్చింది.

"మరైతే ముదరకబుర్లన్నా, పెద్ద కబుర్లన్నా, పణుకు కబుర్లన్నా ఒకటేనా?" వెక్కరుని పైకి లాక్కుంటూ మళ్ళీ అడిగాడు బుజ్జి.

"ఒకటే" అరిచినంత గట్టిగా అంది ఆమె, మళ్ళీ ఏమైనా అడిగేస్తాడేమోనని. అది చూసి అక్కడి నుంచి తుర్రుమన్నాడు వాడు.

వాడికి రాన్రానూ పెద్దవాళ్ళతో మాట్లాడాలంటే భయంగా అన్పిస్తోంది. ఏం మాట్లాడినా ముదరకబుర్లనే అనేస్తున్నారు. ఆ వెధవ బుర్రకేమో బోల్డు విషయాల గురించి తెలుసుకోవాలనుంటుంది. కాని ఎవర్నడిగినా ముక్కు మీద వేలేసుకుంటారు.

ఓ రోజు ఏదో హడావుడి (అకేషన్) సందర్భంగా ఊర్లో పేరంటాలందర్నీ ఇంటికి పిలిచి 'వాయినాలి'స్తోంది బుజ్జిగాడి అమ్మ. మాటల మధ్యలో ఒకామెతో "మా తోటికోడలుకి వురుడొచ్చింది. ఆడపిల్లే వుట్టిందట" అని చెప్పింది. ఆ మాట బుజ్జిగాడి చెవిన పడనే పడింది. వెంటనే ఓ పెద్ద సందేహమూ వచ్చింది. ఇంక ఆవుకోలేక "మొన్న మన గేదెకి పిల్ల వుట్టినవుడు 'మా గేదె ఈనింది' అని అందరికీ చెప్తావా? మరిప్పుడు పిన్ని ఈనింది అనకుండా, పిన్నికి వురుడొచ్చిందంటున్నావేం?" అని అడిగేసాడు. వాడి మాటలకి అక్కడ అందరూ గొల్లుమన్నారు. వాళ్ళ అమ్మకి పీకలనిండా కోపం వచ్చింది. వాడి నడుం వంచి 'ఠపీ..ఠపీ'మని రెండు వేసింది. ఓ పావుగంటసేపు ఏడ్చాడు. కాని వాడి డౌటు డౌటులాగే వుండిపోయింది.

మరో రోజు స్కూలు నుండి వాడు ఇంటికొచ్చేసరికల్లా ఇంట్లో అంతా విచారంగా కనిపించేరు. అందరూ ఎందుకలా వున్నారో వాడి బుర్రకి తట్టలేదు. ఒకవేళ అడిగితే 'తిట్టినా తిట్టొచ్చు లేపోతే కొట్టొచ్చు' అని భయపడి మౌనంగా వుండిపోయాడు. ఎలక్షన్ డ్యూటీకి వెళ్ళిన బుజ్జిగాడి నాన్నగారు అప్పడే ఇంటికి చేరుకున్నారు. అతనికి కూడా వాళ్ళ విచారానికి కారణం తెలీలేదు. బుజ్జిగాడి మామ్మ వైపు చూసి "ఏమైందమ్మా?" అని అడిగాడు. "పద్మకి కూడా ఆడపిల్లే వుట్టిందట్రా" ఇంకొంచెం విచారంగా చెప్పిందామె. "దానికి కూడా అదృష్టం లేదన్నమాట!" తండ్రి మరీ బాధగా నిట్టూర్చాడు. ఆడపిల్ల వుడితే ఎందుకంతలా బాధపడాలో బుజ్జిగాడికి ఓ పట్టాన అర్థమైచావలేదు.

ఏదో ఐడియా వచ్చినట్టు తొందరగా పరుగెత్తుకొంటూ పశువులని కట్టిన దొడ్లోకి వెళ్ళాడు. ఆ సమయానికి పాలేరు భీముడు పశువులకి గడ్డి వేస్తున్నాడు. ఆయాసంతో రొప్పతూ భీముడి ఎదుట నిలబడి, "భీముడూ... మొన్న మన గేదెకి మొగపిల్లే కదా వుట్టింది."

"ఔను బాబూ! ఎందుకటా?!" వచ్చీరాని నవ్వుని ఆపుకుంటూ వ్యంగ్యంగా అడిగాడు. బుజ్జిగాడికి, వాడలా నవ్వడం నచ్చలేదు. చిరుకోపం ప్రదర్శించి ఇంటిత్రోవ పట్టాడు. ఆ రోజు సాయంత్రం మామ్మ పదాలు పాడుకుంటూ పువ్వులు కోయడం వాడి కంట పడింది. ఇదే మంచి సమయమనిపించింది వాడికి. అక్కడికెళ్ళి తనూ పువ్వులు కోయడం మొదలెట్టాడు. ఆవిడ వాడివైపు ఓసారి చూసి, మాటాడకుండా తన పనిలో పడిపోయింది.

"మామ్మా" కొంచెం ముద్దుగా పిలిచాడు.

"ఏం?" కోపంగా కాకపోయినా గంభీరంగా మొహం పెట్టి అడిగింది.

"మన గేదెకి మొగపిల్ల వుట్టిందామరి..." ఇంకా ఏదో అడగబోతున్నట్టు వాక్యాన్ని మధ్యలో ఆపేశాడు.

"ఔను"

"మరి, అత్త (పద్మ)కి ఆడపిల్ల వుట్టిందా మరి..."

ఈసారి కళ్ళజోడు సర్దుకుంటూ ఔనన్నట్టు తలూపింది ఆవిడ.

"మరి గేదెకి మొగపిల్ల వుట్టిందని బాధపడ్డారు. అత్తకి ఆడపిల్ల వుట్టిందనీ బాధపడ్డారు. ఆడపిల్ల వుడితేమంచిదా, మొగపిల్ల వుడితే మంచిదా?"

'ఈ వెధవ మనుషులకీ, పశువులకీ తేడా తెలీకుండా అయిపోయాడు.




దీనిని చెప్పకపోతే ఏం ముంచుకొస్తుందో ముందు ముందు' అని ఆలోచించుకుంది.

"మొగ గేదైతే పాలు ఇవ్వదు. పొలం పనులకి కూడా సరిగ్గా ఉపయోగపడదు. ఆడగేదైతే పాలిస్తుంది. వాటిని అమ్ముకోవచ్చు. నువ్వు రోజూ కాఫీ కూడా తాగుతున్నావు పాల వల్ల. ఇప్పుడు అత్తకి ఆడపిల్ల పుట్టింది. పెద్దయ్యాక దానికి పెళ్ళి చేసి అత్తారింటికి పంపెయ్యాలి. పైగా ఆడపిల్లలకి పెళ్ళి చెయ్యాలంటే బోల్డంత కట్నం అంటే డబ్బులివ్వాలి" అంటూ ఆవిధంగా తను తప్ప ఇంకెవ్వరూ చెప్పలేరన్నట్టు చూసింది. కోప్పడకుండా మామ్మ అలా మాటాడ్డంతో బుజ్జిగాడికి చాలా సంతోషమనిపించింది. దానిని కూడా ఆపుకోలేకపోయాడు. ఫలితంగా మర్నాడు స్కూలుకెళ్ళంగానే ఓ కొత్త విషయం చెబుతానంటూ క్లాసులో వున్న పిల్లలందర్నీ తన దగ్గరకు రమ్మన్నాడు.

"ఇగో అరుణా, సీతా, లల్లీ మిమ్మల్నందర్నీ పెద్దయ్యాక ఇంట్లో నుంచి పంపించేస్తారు. తెలుసా?"

"ఎందుకు?" సీత తన రెండు జెడలనీ ఊపుతూ ఉక్రోషంగా అడిగింది.

"ఎందుకేంటి, ఆడపిల్లలు కదా! పెళ్ళి చేసి అత్తారిళ్ళకి పంపించేస్తారు" వాడి మాటలకి అందరూ ఆలోచనలో పడిపోయారు. వాళ్ళు ఆలోచనల నుండి తేరుకోకముందే "మీ పెళ్ళి కోసం బోల్డు కట్నాలివ్వాలిట. లేకపోతే మీకు పెళ్ళే అవ్వదుట."

"కట్నమంటే ఏంటో నీకు తెలుసేంటిరా?" ఆశ్చర్యంగా అడిగాడు రాజుగాడు.

"కట్నమంటే డబ్బులురా" తనంత తెలిసినవాడు మరోడు లేడు అన్నట్టు చెప్పాడు బుజ్జిగాడు.

ఆడపిల్లలందరికీ బుజ్జిగాడిమీద, వాడి మాటల మీద, విపరీతమైన కోపం వచ్చింది. ఫలితంగా స్కూలు విడిచిపెట్టగానే ఇళ్ళకెళ్ళి తల్లిదండ్రులకి రిపోర్టు చేశారు. 'ఇంత చిన్న వయసులో పిల్లల మనసుల్లోకి ఈ ఆలోచనలెలా వచ్చాయి? ఈ ఆలోచనలన్నీ ఆందోళనలుగా మారితే పిల్లలు మానసికంగా కృంగిపోరూ?' లాంటి ఆలోచనలు చాలామంది తల్లిదండ్రులకొచ్చాయి. 'అవన్నీ అబద్ధాలు' అని పిల్లలనైతే నమ్మించగలిగారు. కాని, అవన్నీ నిజమేనన్న విషయం అందరి మనసుల్లో పీకింది. ఫలితంగా సదరు బుజ్జిగాడి గురించి తెలుసుకోవడం కోసం, మందలించడం కోసం అందరూ మూకుమ్మడిగా స్కూలుకెళ్ళారు. హెడ్మాష్టర్‌గారికి తమ గోడు వివరించారు. హెడ్మాష్టర్ బుజ్జిగాడిని పిలిపించి నిలదీశారు.

"నాకేం తెలుసు? మా మామ్మ చెప్పింది. కావాలంటే అడుగుదాం రండి" అని. అందర్నీ వెంటబెట్టుకుని ఇంటికి వెళ్ళాడు. అక్కడికెళ్ళాక అందర్నీ బయట నిలబడమని చెప్పి, ఇంట్లోకెళ్ళాడు.

లోపలికెళ్ళంగానే వాళ్ళ మామ్మ ఎదురొచ్చేసరికి వెదకబోయిన తీగ కాలికి తగిలినంతగా ఫీలయ్యాడు. స్కూల్ మధ్యలో ఇంటికొచ్చేసిన వాడ్ని చూడగానే ఆశ్చర్యంతో కూడిన కోపంతో "అప్పుడే ఎందుకొచ్చేసావ్?" అడిగింది.

"ఆడపిల్లలకి కట్నమిచ్చి ఇంట్లోనించి పంపించేయాలని చెప్పావా? లేదా?" అసలు విషయానికొద్దాం అన్నంత ఖచ్చితంగా అడిగేసాడు.

"దానికీ, నువ్వు ఇలా మధ్యలో రావడానికీ సంబంధం ఏంటి?"

"నువ్వు చెప్పావా, లేదా? చెప్పు"

"చెప్పాను."

"ఐతే రా. వాళ్ళొచ్చారు" అంటూ ఆవిడ చీరకొంగు పట్టుకుని బయటకు నడిచాడు బుజ్జిగాడు.

"వాళ్ళంటే ఎవర్రా?" అంటూ తప్పదన్నట్టు వచ్చింది.

ఆవిడ బైటకు రాగానే "మీరు పిల్లల్ని జాగ్రత్తగా పెంచడం నేర్చుకోండి." ఒకాయన కోపంగా చూస్తూ చెప్పాడు. "ఇప్పట్నుండే కట్నాలూ, పెళ్ళిళ్ళూ అంటూ వాళ్ళనెందుకు పాడుచేస్తున్నారు" ఇంకో ఆయన. "తరువాత్తరువాత కాలమెలా మారుతుందో... ఇప్పటికే చాలా మార్పులొచ్చాయి. ఆడా మగా అంటూ తేడాలు పెట్టి మాట్లాడ్డం తగ్గించండి" మరొక ఆయన.

బుజ్జిగాడి మామ్మకు ఒళ్ళు మండిపోతోంది. అంతమంది తనకు వార్నింగివ్వడం చూసి ఆమెకు మతిపోయినంత పనైంది. "మీ మనవడు పెళ్ళి చేసి పంపిచేస్తారంటూ మా పాపలకి చెప్పి, భయపెట్టాడట. దానికి కారణం మీరని తెలిసింది. అందుకే వచ్చాం" అంతా అయిపోయాక అసలు కారణం వివరించాడు వేరే పెద్దమనిషి. ఆమె అయోమయంగా చూస్తుండడంతో అందరూ వెళ్ళిపోయారు. బుజ్జిగాడ్ని గట్టిగా కొట్టాలనుకుంది ఆవిడ. కాని వాడు చేసిన తప్పేంటో తెలీక తన చెయ్యిని వెనక్కి తీసుకుంది. బుజ్జిగాడు స్కూలు కెళ్ళిపోయాడు.



## మరణానికి ముందు



అమ్మా!

నేనిపుడు పాత్రలన్నీ తారుమారైపోయిన
'ఆవు–పులి' కథలో నీ కోసం వెళ్ళిపోతున్న –
నీ పాలల్లోనే పెరిగిన నీ లేత దూడపిల్లని
అమ్మా!
నేనిపుడు అడుగులు వెనక్కే వేసుకుంటూ
కసాయితనం వెంట నీ కోసం వెళ్ళిపోతున్న
నీ కన్నుల్లో మెలగిన నీ చిన్ని మేక పిల్లని
అమ్మా!
నేనిపుడు అజ్ఞానుల ప్రయోగశాలకు
మూగనై మౌనంగా నీ కోసం వెళ్ళిపోతున్న
నీ దగ్గరే 'అ–ఆ'లు నేర్చిన నీ తెల్ల కుందేలు పిల్లని
అమ్మా!
నేనిపుడు ఊపిరాడని ఆ మృత్యుశకటంలో
లైసెన్స్ బిళ్ళతోసహా నీ కోసం వెళ్ళిపోతున్న
నీ మురిపెంతోనే పెరిగిన నీ యింటి కుక్కపిల్లని
అమ్మా!
నేనిపుడు నా ప్రపంచంలోని మనుషుల్ని, మమతల్ని
వాటి అందాల్ని నాతోపాటు నాలోనే చంపేసుకుని
నీ కోసం నీకోసమే తరలి వెళ్ళిపోతున్న–
నీ కడుపులోనే పెరిగిన తిరిగిరాని నీ ఆడపిల్లని.



– నందవరం మృదుల